సంవత్సర చందా ౧-౦-౦

ప్రబుద్ధాంధ్ర

కళాభివర్ధనీపరిషత్తుపక్షమున ప్రకటింపఁబడు మాసపత్రిక
సంపాదకుఁడు—పండిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

3 వ సంపుటము | రాజమహేంద్రవరము నవంబరు ౧౫—౨౪ 1924 | ౬ వ సంచిక

స్వవిషయము

కళాభివర్ధనీపరిషత్తు రాజమహేంద్రవరమునకు తీసికొనిరాఁబడుట గతసంచికలో తెలిపియున్నాము. దానిపక్షమున ప్రకటింపఁబడు ఈపత్రికగూడ ఇక్కడకే కొనిరాఁబడినది. సర్కారులలో ఉత్తరువు పుచ్చుకొనుట యైనది; గావున ఈసంచిక యిక్కడనుండియే ప్రకటింపఁబడినది.

ఇది మొదలు ప్రతినెలకును ౬౪ పుటలు చొప్పున ప్రకటించెదము. చందా ౧—౦—౦ మాత్రమే.

ఇంతవరకును ఈపత్రిక రాయవరమున శ్రీమేరీముద్రాలయమున ముద్రింపఁబడుచుండెడిది. తదధిపతులును, రెడ్డిరాణిపత్రికాసంపాదకులును, మామిత్రులు నగు మ. రా. శ్రీ మల్లిడి సత్తిరెడ్డిగారికి మాపత్రికయెడలఁగల ప్రేమ అనంతమై యున్నది. వారు ఈపత్రికకు ప్రారంభమున చేసిన సాహాయ్యమే తరతరములవరకును చాలినదిగా నున్నది. ఇప్పటికిని వారట్టి చేయూఁత నిచ్చుచునే యున్నారు. ఇకముందుగూడ అట్లే మాకు సాహాయ్యము చేయుచుండుట వారికి వ్రతము. ప్రబుద్ధాంధ్రపత్రిక అట్టి తన పోషకునియెడల కృతజ్ఞతాబద్ధయై వారికి పాడిపంటలును సిరిసంపదలును వృద్ధియగుచుండుటకు ఈశ్వరునిఁ గోరుచున్నది.

ఇప్పుడు మాపత్రికను తమ సరస్వతీ పవరు ప్రెస్సున ముద్రించి యిచ్చుచుండుటకు యిక్కడ మ. రా. శ్రీ అద్దేపల్లి లక్ష్మణస్వామినాయఁడుగారు దయతో నంగీకరించియున్నారు. నాయఁడుగారు ప్రఖ్యాతి పొందిన సరస్వతీగ్రంథమండలికి యజమానులు. నిన్న మొన్నటివరకును ఆంధ్రప్రచారిణీ గ్రంథనిలయమునకుఁగూడ ఆధారభూతులు. వారు భాషాభిమానులే గాక భాషాపోషకులును, కవిపోషకులే గాక గ్రంథప్రకాశకులును, గావున ఈచిన్నిపత్రిక వారి యాదరమున మంచిస్థితికి రాఁగలదని నమ్ముచున్నాను. మాదేశీయసోదరులు ఈచిన్నపత్రికను యథాపూర్వముగ పోషింపఁగోరెదను,

సంపాదకుఁడు

ప్రణయతపస్వి

[సుబ్రహ్మణ్యశాస్త్రి—సంపాదకుడు]

"నలభై సంవత్సరాల కిందటి కథ. అనుదినమూ, అనుక్షణమూ నేను మననం చేస్తూనే వున్నాను; కాని పైకి నేనయి చెప్పడం యిదే మొదటి సారి. మొదట నిన్ను చూసినప్పుడు దీనికోసం నువ్వింత పట్టు పడతా వనుకోలేదు. పది రోజులు తిప్పితే నిజంగా నువ్వు విసిగి వెళ్ళిపోతా వనుకొన్నాను. నీకింత పట్టు యెందుకూ?"

"నీకింత పట్టెందుకూ? అని అడుగుతున్నాను. సంసారం విడిచి నలభై యేళ్ళయినాయి. ఒక్క దినమేనా యీ సమాధిని విడిచి అవతలికి వెళ్ళలేదు. వెళ్ళవలసిన పని లేదు. మీకూ నాకూ యేమీ సంబంధం లేదు. ప్రపంచం యేమయిపోయినా సరే. ఈబొందిలో గాలి వున్నంతకాలమూ యీ మండపమే నాకు గతి. యిలాంటి వాడి చరిత్రవినా లని నీకెందుకు కోరిక కలిగిందీ? యిందులో యేమి చమత్కారం వుంటుందీ? యేమి కల్పనలు వుంటాయీ?"

"నూత్నయౌవనంలో వున్నావు నువ్వు. కోరుకున్న పిల్లని పెళ్ళాడి సుఖంగా—అన్నట్లు కోరుకున్న పిల్ల యెలా వస్తుందీ మనవాళ్ళకీ? అసలు కోరిక పుట్టే దాకా వ్యవధి యేదీ? అయినా యీపాటికి నువ్వు యేదో వకవిధంగా సంసారంలో ప్రవేశించే వుంటావు. కాస్తో కూస్తో సుఖం అనుభవిస్తూనే వుంటావు. నీకెందుకు చెప్పూ నాగోడవా?"

"ఈనలభై సంవత్సరాల్లో యిక్కడికనేకమంది వచ్చారు. అనేకమంది నాకు పళ్ళూ వణ్ణమూ తెచ్చి పెట్టేరు. అనేకమంది చూసిపోయేరు. యెవరూ నీలాగ నాకథ చెప్ప మని అడగలేదు. 'అడిగినా మీకెందుకూ? అంటే వూరుకుని వెళ్ళిపోయేరు గాని నీలాగ పట్టుపట్టలేదు. వణ్ణం మానుకుని కూచోలేదు. హఠం చెయ్యలేదు. నీకింత పట్టెందుకూ?"

"మీసంగతి చెప్పండీ" అని వొక్క మాటలో అడిగేశావు నువ్వు. కాని చెప్పడం వస్తే నాకు యెన్ని మాటలు కావాలీ? నిశ్చలంగా కూచున్నావు నువ్వు. పూర్వస్మృతి ఉబకడంచేత ప్రపంచకం అంతా తిరిగిపోతోంది నాకు. చట్టు మని కశాఘాతం తగిలినట్లుగా వుంది. అంగాలన్నీ వివశాలయిపోతున్నాయి. మాట సరిగా రావడం లేదు. ఈనలభై యేళ్ళలోనూ లేని కొత్త అనుభవం కలుగుతోంది యివాళ"

“చూస్తున్నావా నా కళ్ళల్లో నీళ్లు తిరుగుతున్నాయి? యిది దుఃఖం గాదు. విచారం గాదు. ఒకానొక సంగతి నలభై యేళ్ళు దాగివుంది నామనస్సులో. అది యీవేళ బైటికి తీస్తున్నావు నువ్వు. ఈకన్నీళ్ళు ఇందుకు సాక్ష్యం. యిందుకు వుదాహరణ”

“నన్ను విడిచిపెట్టవూ? ఈబైరాగిని కళ్ళుమూసుకుని కాలం గడిపెయ్యనివ్వవూ? సరే. నీదీక్ష అచలంగా వుంది. నీయీ పట్టుదలకి కారణం యేమిటో అది నీమనస్సులోనే వుంచుకో. మరి విను. అయితే యీకథ వినడంచేత నీకు కలిగే ప్రయోజనం యేమీ లేదు “లేకపోతే లేకపోయింది. చెప్పు” అంటే విను.”

“నలభై యేళ్లకిందటి కథ. యివాళా నిన్నానా? ఈనాలుగుపదుల సంవత్సరాల్లోనూ దేశం చాలా మారిపోయింది. అప్పటి రుచులు వేఱూ ఇప్పటి రుచులు వేఱూనూ. అప్పటి ధర్మాలు వేఱూ యిప్పటి ధర్మాలు వేఱూనూ. అప్పటి యువకుల సంకల్పాలు వేఱూ యిప్పటి వారి సంకల్పాలు వేఱూనూ. అప్పటికీ యిప్పటికీ యేతాం పెట్టంత తేడావుంది. అప్పటి కథలు అర్థం చేసుకోవాలంటే ముందు హృదయాన్ని అప్పటికాలంలో ప్రవేశపెట్టాలి. లేకపోతే విన్న లాభం లేదు.”

౨

“తూర్పున యింద్రధనుస్సులో నుంచి సూర్యకిరణాలు పరుగెత్తుతున్నాయి. పడమట కారుమబ్బులు కమ్ముతున్నాయి. గోదావరి జిలిబిలిధ్వనితో తాండవం చేస్తూవుంది. బిందెలు తోముకుంటూ ఆడవాళ్ళు కబుర్లు చెప్పుకుంటున్నారు. స్నానానికి వచ్చి వెళ్లే మగవాళ్ళలో నేనే చివరవాణ్ణి. కత్తిరివొడ్డు యెక్కాను. రైలుపట్టాలు సమీపించాయి”

“అయ్యో, చచ్చిపోయింది పాపం” అని గోల వినిపించింది. వెనక్కి తిరిగి చూడగా దుర్గమప్రవాహంలో వొక యువతి మునుగుతూ తేలుతూ చరమావస్థలో వుంది. ముందుకు కాళ్లు ఆడేయి కాదు. చెంబు కింద పడేశాను. మునుగుదోవతి కూడా విసిరేశాను. ఊర్ధ్వశ్వాసతో గోదావరిలో వురికేను.”

“యువతికి స్మృతి లేదు. సూక్ష్మపరీక్షకి అవకాశం కూడా లేదూ. “ఏమయినా సరే” అని వొడ్డుకు చేర్చాను.”

“ఆడాళ్ళు నలుగురూ చేరేరు. వకటే గోల. ఉచితకృత్యాలు చేసి నేను కడుపులోని నీళ్ళు వెళ్ళకక్కించాను. కొంతసేపటికి శ్వాస వచ్చింది. శ్వాస వచ్చిన కాస్సేపటికి తెలివి వచ్చింది. అందర్నీ చూసి యేడవడం మొదలు పెట్టింది

ఆమె. ఏడవ కన్నారు అందరూనూ. ‘‘బతికేవు. భయంలేదు. ఆఅబ్బాయి నిన్ను రక్షించేడు” అని వక ముసలమ్మ నన్ను చూపింది. వెంటనే ఆఅమ్మాయి కళ్ళల్లో కన్నీళ్ళచాటున కృతజ్ఞత తొణుకులాడుతూ వుండగా నాకాళ్ళు పట్టుకుంది”

‘‘నాకు దణ్ణాలు పెట్టక్కరలే’’దన్నాను. ‘‘నేను తీయకపోతే యెవరో వకరు తీసివుందురు. ఎవరూ చెయ్యలేని పని చెయ్యలేదు నేను. యిందులో యేం విశేషం వుంది? కనక దణ్ణాలు అక్కరలే దన్నాను. ఆడాళ్లు అందరూ ఆపిల్ల పక్షం మాట్లాడేరు. ‘‘ఎంత మాట అన్నావు నాయనా? బతికించావు. యింకేం చెయ్యాలి? నువ్వు వురికేదాకా యెవరూ రాలేకపోయారు. కాళ్ళయ్యి తండ్రీ మొక్కుకుంటుంది’’ అన్నారు. సిగ్గయింది నాకు చివరికి తప్పింది కాదు. వూరుకున్నాను. కన్నీళ్ళతో కాళ్లు కడిగింది ఆ అమ్మాయి’’

‘‘ఇంతలో ‘‘యేదమ్మా నాను బ్బా? తల్లీ బతికి వున్నావా!’’ అంటూ వకావిడ వచ్చింది. అందరూ దారి యిచ్చారు. ఆవిడ ముసలిదీ పడుచుదీ కూడా కాదూ. ప్రథమదర్శనానికే గంభ్ర అని తోచింది. అంతా తప్పుకున్నారు. యువతి ఆవిణ్ణి కౌగిలించుకుంది. ఆవిడ ఆమెని కౌగిలించుకుంది. యిద్దరూ యేడ్చారు. కొంత సేపయిన తరువాత దగ్గిర వున్న ఆడాళ్లు నన్ను చూపించి జరిగిందంతా చెప్పేరు. యువతి ‘‘ఆమహారాజు నన్ను రక్షించా’’ రంది. ‘‘నాయనా నీమేలు మరవనంది ఆవిడ. నేను మాట్లాళ్ళేకపోయాను’’

‘‘కొంతసేపు వుండి యెవరింటికి వారు వెళ్ళిపోయారు. యువతీ ఆమె బంధువురాలూ కూడా వెళ్ళిపోయారు. నేనూ వెళ్ళిపోయాను’’

3

‘‘జరిగిందంతా మాఅమ్మతో చెప్పేను. వక స్త్రీని రక్షించానని మా అమ్మ బ్రహ్మానందం పొందింది. ఆపిల్లని చూసి వస్తానంది. ‘‘వారి యిల్లెక్కడో చెప్పు. క్షణం వుండలే’’నంది. గోదావరిదగ్గిర రోజూ ఆపిల్ల కనపడుతూనే వుండేది; కాని యిల్లెరగను. పోలికలు చెప్పేను. ‘‘అయ్యో, వాళ్ళ సుబ్బమ్మరా. రత్నంలాంటి మనిషి. మంచి పిల్లని కాపాడేవు. దేవుడు నిన్ను రక్షిస్తా’’డని చెబుతూ బయలుదేరింది మాఅమ్మ. ‘‘ఎవళ్ళ సుబ్బమ్మా?’’ అంటూ గుమ్మందాకా వెళ్లేను నేను’’

‘‘గుమ్మంలో భీమారావుగారు నుంచుని వున్నారు. ఎందుకు వచ్చారు చెప్మా అనుకున్నాను. ఆయన మునసబు

కోర్టులో పెద్ద గుమస్తా. చాలా మంచివారు. నేను ఫస్టుఫారం చదివేటప్పుడు వక నెల జీతంకూడా యిచ్చారు. “ఏంసెల” వని యెదురుగా వెళ్లేను నేను. “నాయనా! నాకూతుర్ని రక్షించావు. అమ్మా! మీయిద్దరికోసమూ వచ్చాను. మీరిద్దరూ మాయింటికి రావా” లన్నారు ఆయన నాతోటీ మాఅమ్మతోటీని. అంతవరకూ మాఅమ్మ ఆయన్ని చూడనే లేదూ. యిద్దరమూ తెల్లబోయాము. మాఅమ్మ “మీయింటికే వస్తున్నాను రండి” అంది. తలుపు తాళం వేసి యిద్దరమూ ఆయన కూడా వెళ్ళేము”

“వీథి దాటితే సరి. ఆవీథిలోకల్లా వారి దొక్కరిదే మేడ. మేం వెళ్లేటప్పటికి ఆపిల్ల మంచంమీద పడుకుని వుంది. తెల్లని పక్కమీద బంగారు సలాకలా వుంది. దగ్గిర వకావిడ కూచుంది కబుర్లు చెబుతూనూ. మమ్మల్ని చూసి లేచి కూచుంది ఆపిల్ల. మాఅమ్మ వెళ్లి పక్కలో కూచుంది. “అమ్మమ్మగారూ, మామయ్యగారి మూలాన్న బతికే” నని ఆపిల్ల మాఅమ్మమీదికి వాలి యేడుస్తూ అంది. నాకు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. భీమారావుగారు కూచోమన్నారు నన్ను. నాకు యేమీ తోచలేదు. అలాగే నుంచుని వుండగా పంతులుగారు కుర్చీ తెచ్చివేశారు. కూచునీదాకా పట్టుపట్టేరు. తప్పింది కాదు నాకు”

“అప్పుడు యింట్లో నుంచి గదా వరిదగ్గిర చూసిన ఆవిడ వచ్చింది. “మీ అబ్బాయి మాసుబ్బుని బతికించా” డంది మాఅమ్మతో. ఇద్దరూ కొంత సేపు మాట్లాడుకున్నారు. సుబ్బమ్మగూడా మధ్యమధ్య నాకేసి చూస్తూ మాట్లాడింది. భీమారావుగారు నన్ను చాలాచాలా పొగిడి ఆవేళ మమ్మల్ని ఇద్దర్నీ అక్కడే భోజనానికి వుండమన్నారు. పట్టు పట్టేరు. “అలాగే వుంటాము నాయనా” అంది మాఅమ్మ. వుంటేనే బాగుంటుం దనుకుంటూ మాఅమ్మ అంగీకరిస్తుందో లేదో అని కంగారుపడ్డాను నేను”

“మాభోజనా లయేయి. మాఅమ్మా, ఆవిడా—ఆవిడ పేరు నరసమ్మట. ఇద్దరూ కూచున్నారు. సుబ్బు మంచం మీద పడుకునే వుంది. నేను కుర్చీమీద కూచున్నాను. భీమారావుగారు ఇంట్లోకి వెళ్లి తమలపాకులూ చెక్కలూ తక్కిన సామగ్రీ తెచ్చారు. “అలవాటు లేదంటూనే తాంబూలం వేసుకున్నా నేను. తాంబూలా లయేక యూభైరూపాల నోటు తెచ్చి నాకివ్వబోయా రాయన. “ఇదేమి” టన్నాను. “చెబుతాను పుచ్చుకోం” డన్నాడు ఆయన. వాగ్వాదం జ

రిగింది. ‘‘నేను రాతిబొమ్మని కాదు. మనిషి చెయ్యవలసిన పని చేశాను. దీనికోసం బహుమతీ అక్కర్లేదు. క్షమించం’’ డన్నాను. మాట్లాళ్ళేకపోయా రాయన. గెలిచా ననుకుంటున్నాను నేను. సుబ్బ నింపాదిగా లేచి దగ్గిరికి వచ్చింది’’

‘‘ఏం చెప్పనూ? సుబ్బ యెందుకు వచ్చిందీ? యేమీ తెలిసింది కాదు. తెల్లపోయివున్నాను నేను. ‘‘తూలి పడిపోతావు తల్లీ’’ అని ఆయన పట్టుకున్నా రామెను సిసింద్రీలాగ దగ్గిరికి వచ్చి తన వేలి వుంగరం తీసి నా వేలికి తొడిగింది సుబ్బ. వొళ్లు తెలిసింది కాదు నాకు. ‘‘మాట్లాడకండి. వుంగరం తీశారంటే నేను వప్పుకోను. అది పుచ్చుకోవడం మీ కిష్టం లేకపోతే నన్ను తీసుకెళ్ళి గోదావరిలో పడెయ్యండి’’ అంది సుబ్బ. ‘‘ఇక మాట్లాడకండి’’ అన్నారు పంతులుగారు. నాకు మాట రాలేదు. ఏమి జరుగుతోందో కూడా తెలవలేదు’’

‘‘ఇలావుండగా మాఅమ్మ వచ్చింది. నిశితకటాక్షాలిని చురుకుచురుకున విసురుతూ సుబ్బ ‘‘చూశారా అమ్మమ్మగారూ మామయ్యగారినీ?’’ అంది ‘‘ఏంచేశా డమ్మా? ‘‘అంది మాఅమ్మ. పంతులుగారు జరిగిం దంతా చెప్పేరు. ,,ఈమాత్రం భాగ్యానికి బహుమతీ యెందుకు మనమరాలా?’’ అని మాఅమ్మ అనగా ‘‘మీరుగూడా అలా అనకండీ అమ్మమ్మగారూ’’ అంది సుబ్బ’’

ఇంతట్లో నరసమ్మగారు వచ్చింది. సంగతంతా పసికట్టే వచ్చింది ఆవిడ. మొగం ధుమధుమ లాడుతూ వుంది. మీనాన్న యాభై రూపాయ లివ్వబోతూ వుంటే నువ్వు వుంగరం ఇవ్వడం యెందుకే?’’ అంది ఆవిడ. ఎవరూ మాట్లాళ్ళేదు. వక నిమిషం చూసింది. రెండో నిమిషంలో వంటింటిలోకి పోయింది ఆవిడ’’

‘‘సరే. అవతారం తెలిసిందా? సుబ్బా పంతులుగారూ నాకేసి చూశారు. సుబ్బ చిన్నపోయింది. ‘‘అబ్బాయీ యెప్పుడేనా వస్తూవుండండి మీ అమ్మా నువ్వూను. మరిచిపోకండి మమ్మల్ని’’ అన్నా రాయన. సరే ‘‘ఇక వెళ్ళం’’ డన్న మాట కాదూ అదీ? మాఅమ్మ ముందుదారి తీసింది. వెనకాల నేను బయలుదేరాను. గుమ్మందాకా సాగనంపి కనపడ్డంతసేపూ మమ్మల్ని చూసింది సుబ్బ. పంతులుగారు మాతోగూడానే వచ్చి కచ్చేరీకి వెళ్ళిపోయారు’’

౪

‘‘అన్నట్లు చెప్పడం మరిచిపోయాను. సుబ్బ వితంతువు. పద్ధెనిమి దేళ్ళ నిండు యౌవనంలో వుంది. తారుణ్య

మూ, లావణ్యమూ, పొంగిపోతూ వున్నాయి. పైగా దబ్బపండులాంటి పచ్చని శరీరం. గుండ్రని మొగమూ, విశాలమైన కళ్ళూ అందాన్ని పెంపు చేశాయి. మొగాన్ని బొట్టూ, మెళ్ళో మంగళసూత్రాలూ తప్ప తక్కిన నగలన్నీ వున్నాయి. తరుచు తెల్లకోకలు కడుతుంది. రైక తొడుగుతుంది. సిఖ వేసుకుంటుంది. అప్పుడప్పుడు తమలపాకులు వేసుకుని వుండగా చూచినట్టూగూడా జ్ఞాపకం''

''పద్ధానుగో యేట సుబ్బుకి వైధవ్యం వచ్చిందిట. భర్త మొగం యెరగదు. అందుకు నరసమ్మే కారణం. నిజంగా నరసమ్మలాంటి వ్యక్తి రాక్షసజాతిలో తప్ప యెక్కడా వుండదు. యిరవయ్యోయేట వితంతువై యింటో చేరింది నరసమ్మ. బిడ్డలు లేరు. బతికున్న నాలుగురోజులూ యేడవని రోజు లేదుట మొగుడు. నిజంగా చచ్చి సుఖపడ్డాడాయన''

''నరసమ్మకి సంతానం లేదు. భీమారావుపంతులుకి భార్య లేదు. సుబ్బు తల్లిని సుబ్బు పుట్టినప్పుడు పెద్దపురుట్లోనూ, నెలపురుట్లోనూ నానాబాధలూ పెట్టి నరసమ్మే చంపిందంటారు ఇరుగూ పొరుగూనూ. సుబ్బు అలాంటి రాక్షసి చేతులో పెరగడం నిజమే; గాని హిరణ్యకశిపుడియింట్లో ప్రహ్లాదుడులా పెరిగిందిట''

''పదమూడేళ్ళు వెడతా యనగా రజస్వల అయిందిట సుబ్బు. సమర్తతగువు తగినంత పంపేరు కాదుట అత్తారు. అత్తారంటే మొగుడే యింటికి పెద్దట. నరసమ్మ పగబట్టింది సుబ్బు మొగుడుమీద. కార్యంమాట తలపెట్టనిచ్చింది కాదు పంతుల్ని. అత్తారు కబురంపితే జవాబు లేదు. సంవత్సరం వెళుతుందనగా దాకా చూసి మొగుడే వచ్చాడుట తగువుపెట్టడానికి. మాటామాటా పెరిగిందిట. మూడు రోజులు సకలహంగామూ జరిగిందిట. పెళ్ళాంమీద నిరాశ చేసుకుని వెళ్ళిపోయాడతను. వెళ్ళిన రెండురోజులుకి ప్రాణాల మీద కూడా నిరాశ చేసుకోవలిసి వచ్చింది ఆతనికి''

''యింత జరిగినా నరసమ్మకి అడ్డు చెప్పలేకపోయీవాడుట పంతులు. యిప్పుడిప్పుడు యెదురుకుంటున్నాడుట. బతికి వున్నంతకాలమూ అనుభవించడానికి నరసమ్మకి మామగారు చచ్చిపోతే వెయ్యి రూపాయలు వచ్చే ఆస్తి వస్తుందని ఆశగా వుండేదిట పంతులికి. చస్తూచస్తూ ఆ మామగారు దత్తుణ్ణి పెంచుకుని నరసమ్మకి యెనభై రూపాయలు మనోవృత్తి యేర్పరిచాడుట. వెయ్యిరూపాయలు వచ్చే ఆస్తిపరురాలనుకున్న నరసమ్మ గతి యిలా కడుక్కుపోయాక పంతులు నిర్లక్ష్యం మొదలుపెట్టేడు. ఇది అయినా లోపుగా

నే తగలవలసిన దెబ్బ లన్నీ తగిలేయి ఆయనికి’’

‘‘చెప్పవచ్చిం దేమిటంటే? నరసమ్మతో బాటు సుబ్బమ్మకూడా యిల్లు పట్టింది. నరసమ్మకి మనోవ్ర్తైనా వుంది సుబ్బుకి అదీ లేదూ. చదువు న్నమ్మి యిచ్చాడు సుబ్బుని తండ్రి’’

‘‘సుబ్బు తరుచు మాయింటికి రావడమూ, వాళ్ళ యింటికి మాఅమ్మని తీసుకుని వెళ్ళడమూ మొదలుపెట్టింది. మాయింట్లో వున్నంతసేపూ ‘‘మామయ్యగారూ” అంటూ చనువు అయినాక తుదకి ‘‘మామయ్యా” అంటూ నన్ను పట్టుకొని వదిలీది కాదు”

‘‘ఒకనాడు అమ్మమ్మగారూ, మామయ్యకి యింకా పెళ్ళి చెయ్యరుటండీ?’’ అంది మాఅమ్మని. ‘‘బీదవాడికి పెళ్ళి యేలా అవుతుం దమ్మా? అయినా పాతిక యేళ్ళైనా నిండలేదు మానాయనికి. ప్లీడరుదగ్గిర గుమాస్తా పని చేసి నెలకి పది రాళ్ళు తెస్తూవున్నాడు. సంపాదన పెరిగితేకాని పెళ్ళాడ్డుట మామయ్య” అంది మాఅమ్మ. ‘‘నిజమేనా మామయ్యా?’’ అంది నన్ను సుబ్బు. ‘‘అబద్ధం. నేను చిన్నపిల్లల్ని పెళ్ళాడను. మంచి వితంతువు దొరికితే పెళ్ళాడతా’’ నన్నాను నేను. సుబ్బు వేళాకోళం చేసింది’’

‘‘మంచి వితంతువు దొరికితే పెళ్ళాడుతా నన్నాను. నిజమే; కాని నాకెప్పుడూ ఆవుద్దేశం లేదు. యేదో యాదాలాభంగా ఆలా వచ్చేసింది మాట. మాఅమ్మ నవ్వింది అది విని. ‘‘వీరేశలింగంగార్ని ఆశ్రయిస్తే అనేకమంది మంచి వితంతువు” లంది సుబ్బు ‘‘నేనుగూడా చూసిపెడతా నండు అందికూడానూ. ‘‘పోనీ నువ్వు పెళ్ళాడరాదూ?’’ అంది మాఅమ్మ నవ్వుతూనూ. ‘‘నన్ను పెళ్ళాడతావా మామా?’’ అంది సుబ్బు. ‘‘తయా’’రన్నాను నేను. ఏం తోచిందో యేమిటో సుబ్బుకి. క్షణం వుండలేదు యింక. చరచర వెళ్ళిపోయింది. కోపం వచ్చిం దనుకున్నాను నేను. మాఅమ్మ కూడా జడిసింది’’

“యేంకొంప ములుగుతుందో’’ అని మాఅమ్మ వెనక్కాలే వెళ్ళింది. తల కట్టుకు పడుకుందిట వెళ్ళీ సుబ్బు. పక్కలోకూచుని మాఅమ్మ వోదార్చిందిట’’ ‘‘నాకొడుకు వెఱ్ఱివాడూ. ఏమీ అనుకోకు’’ అని బతిమాలిందట. ‘‘కోపం మాని మాయింటికి వస్తూ వుండకపోతే నన్ను చంపుకు తిన్నట్టే’’ అందిట. ‘‘నాకొడుకు చేత తప్పు చేసినందుకు నీకాళ్ళు పట్టిస్తా’’ నందిట. సుబ్బు జవాబుచెప్పలేదు.’’

‘‘యిదేదో తేలీదాకా నాకు నిద్ర పట్ట’’ దని మాఅమ్మ మర్నాడు

మళ్ళీ వెళ్ళింది. మూడోనాడు కూడా వెళ్ళింది. యింటో నేను నిద్రాహారాలు లేక పరితపించిపోయాను. "అప్పు డలా రక్షించడం యేమిటీ. ఇప్పు డిలా అనడం యేమిటీ?" అని నాలో నేను తహతహ పడ్డాను. నిజంగా మతిపోయింది. నాకు"

"మూడోనాడు" "మౌనం విడిచి మాట్లాడితేగాని వణ్ణం తిన్నం"దిట మా అమ్మ. "అయితే మామయ్యని వోమాటు తీసుకురా" అందిట మొదట సుబ్బు. తరవాత యేం తోచిందో "నేనే అక్కడికి వస్తా" నందిట. వుయ్యాలమంచంలో బిక్కమొగం వేసుకొని నేను కూచుని వుండగా మాఅమ్మా సుబ్బూ వచ్చేరు. సుబ్బు నుంచునివుంది. "యేం చెబుతావో చెప్పు" అంది మాఅమ్మ. సిగ్గుపడి తల వంచుకుంది సుబ్బు. అది చూసి మాఅమ్మ అవతలికి వెళ్ళిపోయింది. ప్రాణాలు కొట్టుకున్నాయి నాకు. వొళ్ళు పరవశం అయిపోయింది. వుండివుండి చురచుర చూస్తూ "మొన్న మీఅమ్మ యేమందో జ్ఞాపకం వుందా?" అంది సుబ్బు. "లేకేమీ? యెక్కువ చనువుమూలాన్ని అలా అంది మాఅమ్మ. అది చాలా తప్పే. క్షమించు. యింకెప్పుడూ అలాంటి మాట లనము" అని నేను మోకారించాను. సుబ్బు తప్పుకుని "అమ్మమ్మా" అని పిలిచింది. మాఅమ్మ వచ్చి నుంచుంది. సుబ్బు మాట్లాళ్ళేదు. సంగతి గ్రహించి నేను వీధిలోకి వెళ్ళేను. వెంటనే నుంచున్న పాళముగా మా అమ్మమీద వాలిందిట సుబ్బు." నన్ను మామయ్యకి పెళ్ళి చెయ్యి" అందిట తల వంచుకుని"

"నిర్ఘాంతపడిపోయిందిట మాఅమ్మ ఆమాట వినీ. "అబ్బాయీ" అని పిలవగా నేను లోపలికి వెళ్ళాను. మాఅమ్మ సంగతంతా చెప్పింది. మాఅమ్మా నేనూ వక్కక్షణం మాట్లాళ్ళేకపోయాము. "నాకొడుకు నామాట కద్దు చెప్పడు. అలాగే నిన్ను పెళ్ళి చేస్తాను వాడికి" అంది మాఅమ్మ. "నేను నిన్ను తప్పకుండా పెళ్ళాడతా" నన్నాను నేను"

"మర్నాడు నరసమ్మ ధవిళేశ్వరం వెళ్ళింది చుట్టాల ఇంటికి. పంతులు బజారుకి వెళ్ళాడు. నాలుగున్నరదాకా మాఅమ్మా సుబ్బూ మాట్లాడుకున్నారు. ఆదివారం కనక నేను యింట్లో రాసుకుంటున్నాను. అంతట్లో మాఅమ్మ వచ్చి "నిన్ను సుబ్బు రమ్మంటోం" దంది. "యింటో యెవరూ లే" రని కూడా చెప్పింది"

"వెళ్ళి బల్లదగ్గిర నుంచున్నాను నేను. సుబ్బు కళ్ళు మూసుకుని నామీదికి వాలింది. చేతులు చాపి పట్టుకున్నాను నేను. "నీకోసం నేను సిగ్గులేని దాన్నయి

పోయాను. బహుశా మానాన్న ఇష్టపడవచ్చు. మా అత్తని లక్ష్యపెట్టను నేను. తొరగా పెళ్ళి ప్రయత్నం చెయ్యి" అంది సుబ్బు. "సరే" అన్నాను నేను. ముందు సంగతి మాట్లాడుకుంటున్నాము. ఈ లోపున యెప్పుడు వచ్చిందో నరసమ్మ వచ్చింది. వీధితలుపు తెరిచే వుంది. మాకు జ్ఞానమే లేదూ. మేం ఆవిణ్ణి చూడలేదు; గాని మమ్మల్ని ఆవిడ చూసింది. వెంటనే ఆవిడ రాక్షసబుద్ధికి వుద్రేకం కలిగింది కాబోలు. చప్పుడు కాకుండా వచ్చి రోకటిపొన్నుతో నక్క పోటు పొడిచింది నరసమ్మ. నాకోసం వుద్దేశింపబడ్డ ఆపోటు సుబ్బు గుండెలికి తగిలింది. ప్రాణాలు జిల్లార్చుకుపోయాయి సుబ్బుకి. కెవ్వున కేకవేసి పడిపోయింది నాసుబ్బు"

"యువకుడా, యేం చెప్పనూ? ప్రాణాలు యెగించి పోయాయి నాకు. నా జీవలత మాట లేక రక్తం కక్కుతూ నేలమీదికి దిగజారి వుంది. తల తిరిగిపోయింది నాకు. వొళ్ళు మండిపోయింది. మొగం పైకెత్తి చూశాటప్పటికి మళ్ళీ రోకలి విసరపోతోంది నరసమ్మ"

"వచ్చే రోకల్ని కుడిచేత్తో పట్టుకున్నాను నేను. నరసమ్మ రోకలి వదిలింది కాదు. నా యెడంచేతిలో సుబ్బు వేళ్లాడుతోంది. నరసమ్మా నేనూ రోకలికోసం లాగులాడేము. ఆ రాక్షసి తిట్లు మొదలు పెట్టింది. "నిన్ను కూడా చంపితే కాని నేను నరసమ్మని కాదు. బ్రాహ్మణఆడదాన్ని కాను" అంటూండగా భీమారావుపంతులుగారు వచ్చారు. ముందు రోకలి లాక్కున్నా రాయన. "అతన్ని చంపడం యెందుకూ? అసలు గొడవ ఏమిటే? ఈ రక్తం—యెవరీ పడిపోయింది? సుబ్బే?—ఏమిటిదీ? ఏంచేశావూ?" అని కంగారుతో అడిగే రాయన. "ఇంటికి వచ్చి ఇంత పని చేస్తాడా? తలకాయ చితకపోడుస్తాను వుండు పీనుగా. నీకోసం విసిరిన రోకటిపోటు సుబ్బుకి తగిలింది" అంది నరసమ్మ బుసకొడుతూనూ. ఇంతలో మాఅమ్మ వచ్చింది. ఏడుపు వచ్చింది నాకు. నుంచో లేకపోయాను నేను. పంతులుగారు కళ్లు తిరిగి కూలబడ్డారు. ఈఅవకాశంలో నరసమ్మ మళ్ళీ రోకలి తియ్యగా తెల్లపోతూ వున్న మాఅమ్మ వెళ్ళి రోకలి పట్టుకుంది. ఇద్దరూ పెనగులాడుతూ వుండగా పంతులుగారు లేచివెళ్ళి నరసమ్మని రెండు గుంజులు గుంజి రోకలి లాక్కుని వీధిలోకి పారేశారు"

"ఈఅల్లరంతా విని యిరుగూ పొరుగూ కొందఱు వచ్చారు. అందరూ జరిగింది తెలియక ఆదృశ్యాన్ని చూసి భయభ్రాంతులై "ఏమిటేమి" టని అడ

గడం మొదలుపెట్టేరు. పంతులుగారు కూడా అడిగారు. మాఅమ్మగూడా అడిగింది”

“దుఃఖం పొంగిపోయింది నాకు. యువకుండా, అలాంటి కష్టాలు నువ్వేం అనుభవించావు? తలుచుకుంటే అదంతా కళ్ళకి కట్టినట్టవుతోంది నాకు. నలభై ఏళ్ళ సాధనవల్ల నిశ్చలం అయిన నామనస్సుగూడా బేజారై పోతోంది ఇప్పుడు. రామరామా యెంత అమానుషకృత్యమూ అదీ? యెంత భీభత్సదృశ్యమూ? యెంత గర్భనిర్భేదకమూ?”

“నిజం చెబుతున్నాను. సుబ్బు మొగం చూశాటప్పటికి స్మృతి పోయింది నాకు. సుబ్బుమీద పడిపోయాను నేను. అంతా సేద తేర్చారు నన్ను. జరిగిందంతా చెప్పేను నేను. అంతా విని పంతులుగారు దుఃఖం పట్టలేక “తల్లి, నీ అభిప్రాయం నాకు సూచన చేస్తే నీకోరిక నేను తీర్చకపోదునా? “అని ఏడిచారు. మాఅమ్మ గోల పట్టలేకపోయారు”

“అలాంటప్పుడు “హాత్తుహూ” త్తంటూ పోలీసువాళ్ళు వచ్చారు. పంతులుగారే జరిగిందంతా చెప్పేశారు. వెంటనే పోలీసులు నరసమ్మని పట్టుకుని అరదండాలు వేశారు. సుబ్బుని బండెక్కించి ఆసుపత్రికి బయలుదేరారు”

“కూడా అందరమూ వెళ్ళేము. అయ్యో! యెంత కష్టమూ? యెంత రాతిగుండెవాణ్ణి నేనూ? నాసుబ్బు నాచేతుల్లో చచ్చిపోవడం చూసిందే కాకుండా ఇన్నాళ్ళయినాక గూడా నానోటితో కవీశ్వరుడులాగ చిలవలూ పలవలూ పెట్టి చెబుతున్నాను గదా నీకు? యెంత సిగ్గులేదూ నాకూ?”

“నిజమే. సిగ్గులేనివాణ్ణి హృదయం లేనివాణ్ణి కాకపోతే ఇన్నాళ్లు ఎలా బతికివుందునూ నేనూ?—అయినా ఇప్పుడేమనుకుంటే ఏం లాభమూ? నాసుబ్బు నన్ను విడిచిపోయింది. ఊరికే పోలేదు. నన్ను యెండుకట్టెని చేసి తాను పువ్వుల రథం యెక్కి పోయింది”

“పరీక్ష అయిన తరవాత అధికారి దహనానికి సెల విచ్చాడు. పంతులుగారి అనుమతితో—వారు చాలా సరసులు. ఆలా అయిపోయినా సుబ్బు నా సొత్తు అయి పోయిందన్నారు వారు. “దైవసాక్షిగా సుబ్బు నీఅర్ధాంగి” అంది మాఅమ్మ. ఇంకేం చెప్పనూ? ఈఇనుపచేతులతో నేను నిప్పు పెట్టేను”

“సర్కారు నరసమ్మకి ఉరిశిక్ష విధించారు. మా రావుపంతులుగారు సుబ్బుకి ఈసమాధి కట్టించి తక్కిన ఆస్తి

అంతా వితంతుశరణాలయానికిచ్చివేసి కాశీ వెళ్ళిపోయారు. నేను ఈసమాధి నాశ్రయించాను"

"యువకుడా, నువ్వు చెప్పు. అలాంటి నాసుబ్బి పోయాక ప్రపంచకంలో నాకింకేమి వుందీ? అసలు బతికివుండడమే అస్వాభావికం. అయితే విధి అలా రాశినప్పుడు ఏంచెయ్యనూ?"

"నేను ఈసమాధి నాశ్రయించాను. మాఅమ్మ నామనస్సు తిప్పడానికి చాలా ప్రయత్నించింది; కాని లాభం లేకపోగా తనుగూడా ఇక్కడే మకాం వేసింది. వంటా పెంటా లేదు. యిద్దరికీ ఆహారం లేదు. నాసుబ్బి లేకపోయాక నాకు ఆహారం యెందుకూ? నేనిలా అయిపోయాక మాఅమ్మకిమాత్రం ఆహారం యెందుకూ? ఇద్దరికీ పోలేదూ ఆప్రయత్నంమీదికి బుద్ధి. గోదావరినిండా నీళ్ళు వున్నాయి. ప్రపంచకం అంతటా అణ్వణుభాగానికిగూడా గాలి వుంది. కోరిక చచ్చిపోతే నీళ్ళూ, గాలీకంటే ఆహారం ఏం వుందీ?"

"నెల్లాళ్ళదాకా పట్నం అంతా ఇక్కడే వుంది. సంవత్సరందాకా ఆసమ్మర్దం తగ్గలేదు. ఇప్పటికీ యెవరో వచ్చి చూసి పోతూనే వుంటారు. పళ్ళు తెచ్చేవాళ్ళు కొందఱూ—వణ్ణం తెచ్చేవాళ్ళు కొందరూ—ఏం చెప్పనూ? కొత్తలో అనేకమంది వికలాంగులు బతికేరు ఇక్కడ"

"రెండు సంవత్సరాలుండి మాఅమ్మ కోడలిదగ్గిరికి వెళ్ళిపోయింది. అదిగో ఆసమాధి ఆవిడిదే. అదీ ఇదీ నాకు ఆధారాలు. అదీ ఇదీగూడా వకదానికొకటి తీసిపోని ప్రేమనిలయాలు"

"నలభై ఏళ్ళనుంచి యీమండపంమీద కూచుని ప్రణయతపస్సూ, ఆమండపంమీద కూచుని మాతృజపమూ చేస్తూన్నాను."

"భౌతికసుఖాల్లో దొప్పదోగుతూ వున్న పడుచువాడా, వాదోపవాదాల్లో మునిగితేలుతూ వున్న రసపిపాసీ, తథ్యమిథ్యావిభేదం యెరగని లఘుహృదయుఁడా, ఇలాంటి అప్రాకృతజీవితం నీకేమి రుచిస్తుందీ? ఇది వినడానికి పట్టు పట్టి ఏమి బావుకున్నావూ?"

"ఆసమాధిమీద కూచుని మాఅమ్మ అడ్డాల్లో శైశవసుఖం అనుభవిస్తున్నాను నేను. ఈసమాధిమీద కూచుని నాసుబ్బి కౌగిలింతలో పారవశ్యం పొందుతూవున్నాను. నాకు కష్టం లేదు. దుఃఖం లేదు. ఈప్రపంచకంలో మరేమీ లేని నాకు మరేమి వుంటుందీ?"

కొండవీటిదండయాత్ర

[శతావధాని ఓలేటి వేంకటరామశాస్త్రిగారు]

౧

సీ. పరరాజ్యపరదుర్గపరవైభవశ్రీలఁగొనకొని విడనాడు కొండవీడు
పరిపంథిరాజన్యబలముల బంధించు కొమరుమించినబోడు కొండవీడు
ముగురురాజులకును మోహంబుఁ బుట్టించు గుఱుతైనయుత్రితోడు కొండవీడు
చటులవిక్రమకళాసాహసం బొనరించుకుటిలాత్ములకుఁ గాడు కొండవీడు
గీ. జవనఘోటకసామంతసరసవీరభటనటానేకహాటకప్రకటగంధ
సింధురారావమోహనశ్రీలఁ దనరు కూర్మి నమరావతికి జోడు కొండవీడు.

(శ్రీనాథుఁడు)

క. కృష్ణానదిచెంగట రోచిష్ణుప్రాకారహర్మ్యశిఖరనిరీక్షా
తృష్ణాగతపథికమనోజిష్ణు వగుచుఁ గొండవీడు చెన్నలరారున్ ౧

క. ఈకుండినపురియందే శ్రీకృష్ణుఁడు తొంటినాఁడు శిశుపాలు బలో
ద్రేకమునఁ దోలి రుక్మిణిఁ గైకొని చని పెండ్లియాడెఁ గడుదర్పమునన్ ౨

ఉ. ఏటికిఁ గొండవీటిసిరి నిట్టులెంచును లేనిపోని గొం
డాటము సేయ నెన్నియొ శతాబ్దము లేగినఁ గాలశక్తిచేఁ
గోటలుఁ గొమ్మలుం బుడమిఁ గ్రుంగియు గ్రుంగియు నున్నయేనియున్
నేఁటికిఁ దద్విశేషములు నివ్వెఱఁ గొల్పెడుఁ బోల్చిచూచినన్. ౩

ఆ. ఓరుగల్లురాజ్య ముపశమిల్లినతోనె కొండవీటఁ గాచుచుండు రెడ్లు
ప్రబలి రాష్ట్రి మేలుపఱిచి యీమర్గముఁగట్టి మంచిపేరుఁ గాంచినారు. ౪

క. పదునాలుగువందలయేఁబదినాల్గవవత్సరమున బాహాబలసం
పద రెడ్డిమహీపాలుర నెదిర్చి కుండినము నుత్కలేంద్రుఁడు గొనియెన్. ౫

చ. కటకము రాజధానిగఁ బ్రశాస్తి వహించి సమస్తసంపదు
త్కటు లగు నుత్కలేంద్రులు ప్రతాపమునం బరవీరులన్ విశం

కటగతి నోర్చి పూర్వదిశఁ గాకతెలు నాంధ్రమహీతలంబు ని
క్కటముగ నెల్లయూరువఱకుం గొని యేలఁదొడంగి రాదటన్. ౬

క. ప్రస్తుతకథావసరమునఁ బ్రస్తుతవిక్రముఁడు వీరభద్రనృపాలుం
డస్తమితాన్యభయుం డై నిస్తులముగఁ గొండవీటినిఁ బాలించున్. ౭

ఉ. ఉత్కలదేశలక్ష్మిని మహోన్నతి నేలుప్రతాపరుద్రభూ
భృత్కులమౌళిపుత్త్రుఁ డతఁ డేడ్తెఱ నేల్బడిసేయుచుండఁగా
నుత్కటసంపదం బొదలు చుండిన కుండినరాజ్యలక్ష్మికై
యుత్కలికన్ విదేశనృపు లువ్విళులూరుచు నుందు రెప్పుడున్ ౮

చ. కల దలవీరభద్రునకు గాదిలిచెల్లియ లన్నపూర్ణ నా
నల రెడు ముద్దరాలు సుగుణాలయ; తండ్రి ప్రతాపరుద్రభూ
తలపతి పంప సోదరుని దగ్గఱ నేల్బడియందుఁ దోడుగాఁ
జెలఁగుచుఁ గొండవీటనె వసించుఁ బ్రశస్తయశోవిశాలయై ౯

క. కడు వెడఁద కనులుఁ, బచ్చని యొడలును, జిఱునవ్వు గుంట లొక్కించుక యే
ర్పడు చెక్కు, గొంచెవుమై పొడవును దగ నన్నపూర్ణ పొలుపెసలారున్ ౧౦

ఉ. గానమునందు, సాహితిని, గావ్యకథారచనమ్ములందు, వి
జ్ఞానమె కాక యక్కటకనాయకనందిని వింట నమ్ము సం
ధానముచేసి లక్ష్యమును దప్పక యేయఁ గడిందివాలుఁ జేఁ
బూని హయాధిరూఢయయి పోరఁగ నేర్చె భయంకరంబుగన్ ౧౧

ఉ. ఆదిని దేవవాఙ్మయమునం, దటు లాంధ్రమునందు, నట్టు లో
ఢ్రాదిని, మాట నేర్చినమిటారి; కటారిని ద్రిప్ప నెంతయో,
సాదనఁ జేసినట్టి నెఱజాణ; యటంచు ననేకభంగులన్
మేదిని నన్నపూర్ణగుణమే గణియింపఁగ నయ్యె నయ్యెడన్. ౧౨

క. కటకేశ్వరు ప్రియపుత్త్రికయఁట ఖడ్గవిహారధీరయఁట విద్యాలం
పటయఁట! యాంధ్రమహీభృత్కటకంబుల నామె పేరుఁ గను టబ్రంబే? ౧౩

ఆ. కార్యఖడ్గముల నొకంట నెందేనియు నన్నపూర్ణమాటఁ గొన్నగాక
యన్న వీరభద్రుఁ డన్న! కొంచియమును జేయ నొల్లఁ; డౌర చెలువ తెలివి. ౧౪

క. ఏకార్య మైనఁ గానీ "యాకర్జముచంద మిట్టి" దని పూర్ణ మయే
వాక్కొనెనా యది యట్టులు కాక తిరుగ; దాపె యెంత గడుసరిదొ కదా! ౧౫

ఉ. అన్నయు నన్నపూర్ణయును నయ్యయివేళలయందు నెవ్వియో
కొన్ని ప్రసంగముల్ నడుపుకొన్నపు, డప్పుడు మేటికీరితిన్
జెన్నగు కృష్ణరాయనృపుశీలముఁ బాలనముం, బ్రతాపమున్
మున్నగువానిగూర్చి యనుమోదముఁ జూపెడు నాపె యేమొకో. ౧౬

క. దాసీపుత్త్రుం డనుచు నుదాసీనతతోడ నన్న యనఁ బూర్ణమ ని
శ్శ్వాసమ్ము వొడమ నయ్యది యాసు గలుగువారి నుడి సుమీ యని పలుకన్ ౧౭

ఉ. అంతియె; యన్న చెల్లియలు నాంధ్రజగత్పతి కృష్ణరాయభూ
కాంతునిగూర్చి యాశికొనఁ గల్గిన; దంతకు మించి యాతఁడా
సంతయులోపముం బలుకఁ డాపెయు నప్పుడ కాని యాతనిం
జింతయొనర్ప; దేమని వచింతుము రాజకుమారచిత్తముల్. ౧౮

చ. విమలగుణాంబురాశు లయి వెల్గుచునుండెడివారి కేవొ లో
పములను బన్నుచుండెద రభాగ్యులు; వాని వివేకదూరు ల
క్రమములు నాక నమ్మెదరుగా? విదుషీమణి యన్నపూర్ణ చి
త్తమునకు నట్టి నానుడు లతథ్యము లైకనుపట్టునే కదా? ౧౯

చ. గొనములయందె యాదరము కొండికవాదులయం దసడ్డ, స
జ్జను లయినట్టివారలకు సాజము గావునఁ గృష్ణరాయభూ
పునియెడఁ బక్షపాతమును బూనెనొ యే మొకొ యన్నపూర్ణ; యుం
తనె మన మన్యథా తలఁపఁ దప్పగు; రండిటు పాఠకోత్తముల్. ౨౦

చెన్నపురి : భావిగతి

(ఆంధ్ర శేషగిరిరావుగారు)

సారస్వత సమాజము

1639 సంవత్సరములో తూర్పు ఇండియాకంపెనీవారికి తూర్పు సముద్రతీరమున ఫ్రాన్సిసుడే అనుదొర యేజంటు. అతఁడు చంద్రగిరిరాజు దగ్గరనుండి ఇప్పుడు చెన్నపురి యున్న ప్రదేశమును కొని ఆంగ్లవర్తకస్థానముగ చేసెను. చెన్నపురి యందలి రమ్యదృశ్యములలో నొకటియైన సెంటుజార్జికోట ఫ్రాన్సిసుడేదొర నిర్మించినదే.

ఏముహూర్తమున ఫ్రాన్సిసుడేదొర ఈపురమునకట్ట శంకుస్థాపన చేసెనో కాని అనతికాలముననే అభివృద్ధినొంది ఇప్పుడు హిందూదేశమందలి మహానగరములలో తృతీయస్థాన మాక్రమించుచున్నది. ఆరు రైలుస్టేషనులు. పది దినపత్రికాకార్యాలయములు. ఆరు కళాశాలలు. లెక్కింపరానన్ని ఉన్నతవిద్యాలయములు. లార్డుమన్రో, లార్డుకారనువాలీసు, జనరలునీలు, మొదలగు ఆంగ్లమహాపురుషుల శిలాప్రతిమలతో; మ్యూజియము, స్మాచికిర్కు, పీపుల్సుపార్కు, నేపియరుపార్కు మొదలగు మనోహరదృశ్యములతో; హైకోర్టు, లాకాలేజి, ఇత్యాది బ్రహ్మాండమైన భవనములతో; నితాంతవైభవమున చెన్నలరారుచున్న ఈ చెన్ననగరము

ఒకశతాబ్దమునకు పిమ్మట

చెన్నుదఱిగి విన్నబోయి చూపఱకు విచారముకొల్పు శిథిలావస్థ పొందునన్నచో నేటివారికి ఆశ్చర్యము కల్గకమానదు. కాని నిజ మట్టిది.

1921 వ సంవత్సరపు జనాభాలెక్కలలో మద్రాసు జనసంఖ్యయందు పెరుగుదల చూపట్టలేదు. అప్పటి జనాభాలెక్కల ప్రకారము 1911 వ సంవత్సరములో నెంతమంది జనులు నివసించుచుండిరో 1921 వ సంవత్సరములో కూడ నంతమందియే మదరాసు నందు నివసించుచున్నారు. గోగుకామ పెరిగి నట్లు మూడుశతాబ్దములలో మహానగరముగా మారిపోయిన మద్రాసునగరము యొక్క జనసంఖ్య నేఁడు ఎదుగు బొదుగులేక కనుబొమలమీఁదివెండ్రుకలవలె నిట్లు నిలుకడ పొందుటకు కారణ మేమి? చావు పుట్టుకలు సమముగా నుండుటయే గదా! చావులకంటె పుట్టుకలే ఎక్కువగా నుండుట ప్రపంచవైఖరి. మదరాసు నం దట్లు లేదు. 1911 వ సంవత్సరము నుండి యెన్నియో క్రొత్తకుటుంబము లీనగరమునకు వలసపోయియుండును. అయినను జనసంఖ్య

అధికము కాలేదు. కావున, ఆనగరమున వలసవచ్చిన వారియు, పుట్టినవారియు, మొత్తముకంటె చచ్చినవారి సంఖ్యయే హెచ్చుగా నున్నది. ఇది పురోభివృద్ధి సూచకమా?

కృష్ణాపత్రిక వాక్రుచ్చినట్లు మద్రాసునగరము రెంటికిని చెడిన రేవడ యైనది. చెన్నపురి ఏజాతికిని అంది పొందని పట్టణము. అది తమిళనాడున కుత్తరము; తెలుగుమాగాణికి దక్షిణము; కర్ణాట దేశమునకు తూర్పు; వ్యవహారరీత్యా ఆంధ్ర కర్ణాటతమిళ దేశీయు లీనగరమున నివాసము లేర్పఱచుకొనవలసివచ్చినది. ప్రత్యేకజాతివ్యక్తిత్వమునకు మద్రాసు దర్పణము కాదు. 'చౌచౌ' నాటకమునకు వలె దానిబ్రతుకు సంకరమైపోయినది. ప్రత్యేకవ్యక్తిత్వములు గల ఆంధ్రకర్ణాటతమిళ దేశీయులకు 'ఉమ్మడిగొడ్డు' సామ్యముగ నున్న మద్రాసునగరమున కెప్పట్టుననైన ముప్పు తప్పదు.

1919 వ సంవత్సరపు ఇండియాగవర్నమెంటు ఆక్టుతో చెన్నపురి దురదృష్టపురేఖ బయలుబడినది. ఆ ఆక్టు భాషాప్రయుక్తరాష్ట్రనిర్మాణమున కొప్పుకోలిచ్చినది. 'మూన్నాళ్ళు మురిపించిన నడుమంత్రపు' రాజకీయపరివర్తనము రాకుండినచో ఆంధ్రు లీనాటికే ప్రత్యేకరాష్ట్రసంపాదన మొనర్చి యుండుదురు. ఇప్పుడైనను అచిరకాలములోనే ఆంధ్రరాష్ట్రనిర్మాణమగు సూచనలు చూపట్టుచున్నవి. ఆంధ్రోద్యమనాయకులలో నొకడైన బయ్యా నరసింహేశ్వరశర్మ హైందవకార్యనిర్వాహణ సంఘసభ్యులుగా నున్నారు. మోచర్ల రామచంద్రరావు, భూపతిరాజు వేంకటపతిరాజు, మొదలగు ఆంధ్రమహాపురుషులు హైందవశాసనసభ నలంకరించుచున్నారు. పానుగల్లు రాజా, పరశురామ పాత్రో, మద్రాసునగరమున మంత్రులై వెలుగొందుచున్నారు. ఇంతవఱకు మన కడ్డువగులుచున్న తమిళసోదరులు కూడ ఆంధ్రరాష్ట్రనిర్మాణమునకు సుముఖులై యున్నారు. కావున, రేపో మాపో ఆంధ్రరాష్ట్రనిర్మాణము తప్పక కాగలదు. కృష్ణాతీరస్థమగు విజయవాడపురమున విశ్వవిద్యాలయము, హైకోర్టు, శాసనసభ, నిర్మించుకొని ఆంధ్రులు మద్రాసునగరముతో అంటు వదల్చుకొందురు.

అఖిలభారతదేశీయులకు వారణాసి యందలి విశ్వేశ్వరాలయ మెట్టిదో ఆంధ్రులకు మద్రాసు నందలి ఆంధ్రపత్రికాకార్యాలయ మట్టిది. ఏతత్కార్యాలయము కొలదికాలములో బెజవాడకు మార్చబడు నని వినుచున్నాము. అందుతో మద్రాసునగరమునకును, ఆంధ్రులకును, గల అంటులో సగభాగము వదలిపోవును

మిగిలినసగమును ప్రత్యేకాంధ్రరాష్ట్రని ర్మాణముతో తుడిచిపెట్టుకొని పోవును. మద్రాసు నందలి కుళ్ళాయినీళ్ళును, నెల్లూరుబియ్యమును వదలి ఆంధ్రులు బెజవాడ ఎప్పుడు వత్తురో అప్పుడే చెన్నపురి ప్రస్తుతప్రతిభ కోల్పోవును.

పులిమీదపుట్ర యున్నట్లు విశాఖపురి నూతనముగ నిర్మింపబడు నౌకాశయముతోడ్పాటున మదరాసునగరవర్తక వ్యాపారములలో మున్పాతిక మువ్వీసము కబళించివేయును.

ఆంధ్రులు విసర్జించుటతోడనే మద్రాసు మధ్యమస్థానమును పోగొట్టుకొని తమిళరాష్ట్రమునకు మారుమూల యగును. అందుపై సౌకర్యార్థము తమిళులు తమరాష్ట్రరాజధాని కావేరీతీరస్థమగు తంజావూరునకేని మఱియెక్కడికేని తీసికొనిపోవుదురు.

ఒకరాష్ట్రమునకు రాజధానియగుటకై చెన్నపురికి సౌకర్యములు తక్కువ. ప్రకృతి అనుగ్రహించని పట్టణ మిది. ఈ నగరసమీపమున గొప్పజీవనది యేదియు ప్రవహించుట లేదు. విజయనగరమున తుంగభద్ర, బెజవాడను కృష్ణ, తంజావూరున కావేరి, అయోధ్యను సరయు, కలకత్తానగరమున హుగ్లీ, రాజమహేంద్రవరమున గోదావరి, వారణావతమున గంగ, ఆ యాపట్టణము లొకప్పుడు మహాసామ్రాజ్యములకు రాజధాను లగుటకు ముఖ్యకారణములు. మద్రాసున కట్టి భాగ్యము లేదు. కూముస్రవంతి యున్నదందు రేమో?.

ఈచెన్నపురి ...—కలకత్తాకువలె సస్యవంతములు సారవంతములునునగు భూములమధ్య నున్నదా? లేదు. బొంబాయికి వలె ధనవంతమై భాగ్యభోగ్యముల కాకరమైనదా? కాదు. వారణాసికి వలె యాత్రాస్థలమా? కాదు. అయోధ్యకు వలె నిది పురాతనపత్తనమా? కాదు. విశాఖపురికి వలె నిందు ప్రకృతిసిద్ధమైన నౌకాశయ మున్నదా? లేదు. ఆంధ్రకర్ణాటతమిళ దేశములలో నొక్క దేశము నకైన నిది మధ్య నున్నదా? లేదు.

ఇన్ని 'లేదు కాదుల'తో కూడిన మద్రాసునగరము భావిగతి అధోగతి యని వేఱ చెప్పవలయునా?

తమిళాంధ్ర దేశీయులచే విడనాడబడి పూజాపురస్కారములు లేని దేవాలయము వలె నానాటికి తీసికట్టై కొంత కాలమునకు మద్రాసునగరము చరిత్రపరిశోధకుల మనఃపథముల తక్క తక్కిన తావుల విస్మృతి గనును. హాంపీవిజయనగరము వలె మదరా సొక్కడినమున భ

స్నేపటలము కాదు. 'ఉరగదష్టుని మేని నెత్తురును వోలె,' క్షయరోగపీడితుని వోలె, క్రమక్రమముగా దిగనారి 'సర్వముం గదలంజేయు కాలమూర్తితో మద్రాసునగరము శికస్తుపడిపోవును. అవంతకాలగర్భమున ఏమి ఇమిడి యున్నదో సూక్ష్మముగ గ్రహింప వీలున్నది ఒక్కొక్కప్పుడు.

మౌనభంగము

మునిమాణిక్యం నరసింహారావుగారు బి. ఎ

[సాహితీసమితి]

తేఁతసంజలు పూఁతబూసిన
కారుచీఁకటి గ్రమ్మి నెల్లెడ
కంటకావృతమార్గమున నే
నొంటినై పోతిన్

మెఱపుతీగలు మెఱసిపోయెను
మిన్నుపూవులు కునికిపోయెను
మధువు నిండిన హృదయపాత్రను
వంచితిని వగచే

పండువెన్నెల చెదరిపోయెను
నిండుకోర్కెలు మాసిపోయెను
చండభానుదురంతకిరణ
జ్వాలలం బడితిన్

మధురమృదుతరహృదయవీణా
తంత్రు లన్నిటిఁ ద్రెంచిపోసితి
మూగవోయిన జీవరాగము
నేమి వినిపింతున్

విస్మృతకవి

తుర్లపాటి గోవర్ధనరావుగారు

సారస్వతసమాజము

ప్రకృతినై చిత్రియే పరబ్రహ్మ మనుచు
కీర్తనము నేయు కవిరాజు వర్తనమ్ము
కాలగర్భానఁ బడుగాక, కలదు దాని
ప్రతిఫలన మీప్రజామనఃఫలకమందు.

కావ్యపాఠమ్ము లాసతోఁ గాంచువేళ
రసపరిప్లుతభావమ్ము లరయలేమె ?
సుందరోద్యానవీథి నిందిందిరమ్ము
లబ్జమధువును జవిఁజూచు నటుల మనము

కపురపుంబల్కు వోల్పల్కు క్షేత్రయందు
బొదిగి, ప్రతివస్తువందు సంపూర్ణమైన
భావసౌరభ్యముం బయల్పరచుకతన
మఱచిపోవుద మన్నను మఱపురాఁడు.

విస్మృతకవీ ! త్వదీయకవిత్వమందు
బ్రతిఫలించిన నీరూపపటముఁ గంటి
నహహా ! నీనేర్పనన్యసాధ్యమ్ము ప్రేమ
మడరఁ గైకొను మోయి పద్యముల కాన్క

ఆంధ్రసాహిత్యపరిషత్తు

[శ్రీ శేషాద్రిరమణకవులు]

పండ్రెండేండ్లకు ముందు మదరాసు నందు ఆంధ్రవాఙ్మయసేవయే ప్రధానలక్ష్యముగా నుంచుకొని విద్యాధికులు ఆంధ్రసాహిత్యపరిషత్తును నిర్మించిరి. కార్యక్రమము-నిర్మాణవిధానము చూడ ఆంధ్రవాఙ్మయమున కీసంస్థ యమితమగు నుపకారము చేయు ననియు రాజావలంబనము లేని యాంధ్రభాష పరిషత్తు వలన నభివృద్ధికి వచ్చుననియు ఆశపడితిమి. పరిషత్తు నడుపుచున్నవారు పలుకుఁబడి గల విద్యాధికు లగుటచే రాజానుగ్రహమువలన ఈసంస్థకు మొదట చాలినంత ధన మేర్పడెను. ఆంధ్రదేశమునం దే సంస్థయు నింతవఱకుఁ బొందని విరాళముల నీపరిషత్తునకు లభించెను. ఉద్ధారకులు సంవత్సరమునకు రు 5000 చొప్పనను పోషకులు 1000 చొప్పనను యావజ్జీవసభ్యులు రు 100 చొప్పనను విరాళముల నీయసాగిరి. ఆరంభమున పరిషత్కార్యములు చురుకుగాఁ జరిగె నని చెప్పవచ్చును. ఆంధ్రమున విపులమగు నిఘంటు వొకటి యవసర మని నిశ్చయించి పరిషత్తు తొలుత నిఘంటునిర్మాణవిధమును గూర్చి పనిచేసి పండితుల యభిప్రాయములఁ బడసి కార్యక్రమమున కుపక్రమించెను. త్యాగశీలు రగు పిఠాపురముమహారాజావారు నిఘంటువ్యయము భరించుటకు వాగ్దానము గావించిరి. రెండవపని పరిషత్తువారొనర్చినది పత్రికాప్రచురణము. తొలుత పరిషత్పక్షమున నొక త్రైమాసికపత్రిక ప్రచురింపఁబడెను. అది మంచి విలువ గల కాగితములపై నుత్తమపరిశోధకవ్యాసములతో శాసనప్రతిబింబములతోఁ గొంతకాలము నడచినది. ఈపత్రిక యాంధ్రవాఙ్మయమున కద్వితీయ మగు సేవ గావింపఁగల దని విశ్వసించితిమి.

మూఁడవది తాళపత్రగ్రంథసంపాదనము. లిఖితగ్రంథములు పెక్కుచోటుల నశింపసాగెను. కవిత్రయము మొదలుకొని గోపీనాథము వెంకటకవివఱకుఁ గల పూర్వకవుల గ్రంథముల నామములు వేలకొలఁది వినరాఁదొడంగెను; గాని లభించుట దుర్ఘటముగా నుండెను. దొరతనమువారి పరిశోధకులు నూతనగ్రంథములు సంపాదించుట మిగుల స్వల్పముగా నుంటచే భాషకొఱకు గ్రంథసంపాదనము మిగుల నావశ్యకముగ నుండెను. పరిషత్తువారి కృషివలన ఆంధ్రుల గృహములలో మాటుమడఁగియున్న యుత్తమగ్రంథము

లుబయుటబడుననియు మాతృసేవకు యువకులకు ఉత్తమమార్గము లభించు ననియు నాశపడితిమి. ద్రవిడ దేశమునందును నిజాము రాష్ట్రమునందును ఇతరాంధ్రమండలములందును గ్రంథసంపాదనమునకుఁ బ్రచారకులను నియోగించిరి. వారియిరువురలో మొదటివాఁడు గుంటూరుమండలమునను రెండవవాఁడు నిజాము రాష్ట్రమునను ఒక సంవత్సరము ప్రాచీనగ్రంథ సంపాదనములోఁ బనిచేసితిమి. మేమిరువురము సంవత్సరము గ్రంథసంపాదనము చేయఁగనే పరిషత్తు బొక్కసము సన్నగిల్లినదని పనినుండి తొలఁగించిరి. పరిషత్తువారు గ్రంథసంపాదనమును ప్రధానలక్ష్యముగ నుంచుకొనవలసియుండఁ గ్రమముగా ఆయుద్యమమునే మాని వేసిరి.

కొంతకాలమునకు పరిషత్తువారు నిఘంటురచనమున కారంభించిరి. బ్రహ్మశ్రీ వేదము వెంకటరామశాస్త్రివారుని ఘంటువునకు ముఖ్యసంపాదకులుగా నిలిచి కొంత కృషి చేసిరి. కొలఁదిగా బని జరిగెను; గాని యది తృప్తికరముగా నుండకపోవుటచే శ్రీపిఠాపురాధీశ్వరులు నిఘంటునిర్మాణమును బరిషత్తునుండి వేఱుపఱచి తమ యవలంబనమున పిఠాపురములో నుంచిరి. ఆంధ్రాంగ్లసంస్కృత భాషాభిజ్ఞులగు మొక్కపాటి సుబ్బారాయఁడుగారు నిఘంటువును సక్రమ మగు పంథలో నడుపసాగిరిగాని భాషాదురదృష్టవశమున వారును తత్సమశబ్దములను వ్రాయుచున్న తేవప్పెరుమాళ్ళయ్యగారును కీర్తిశేషులైరి. ఇప్పుడు నిఘంటువు పరిషత్సంబంధము లేకయే మహారాజావారి యాదరణమున నడచుచున్నది. నిఘంటుకార్యస్థానము శ్రీమహారాజావారి స్వంత మగు నుద్యమ మగుటచే దానిని విమర్శించుటకు మనకు స్వతంత్రము లేదు.

పరిషత్తు చేసిన పనులలో మిగుల గొప్పపని యొకటి కలదు. దానిని మనము మఱతుమేని కృతజ్ఞులము కాఁజాలము. గ్రామ్యగ్రంథములు విద్యాశాఖవారి యాదరణమును బడసి పాఠశాలలోనికిఁ బ్రవేశించి గ్రాంథికగ్రంథసముదాయమునకుఁ గల ప్రతిష్ఠ గూలార్చు సమయమున పరిషత్తు ముందునకు నిలచి పండితుల ప్రోత్సహించి భాషాభిమానులను గార్యరంగమునకు దుమికించి భాషావిప్లవమును సాటి గ్రాంథికభాషకుఁ గలస్థానమును గాపాడి వాఙ్మయరంగమునుండి గ్రామ్యభాషను తొలఁగించెను. పరిషన్నిర్మాణమున దేశమున కీవిధముగా నారంభమునఁ గొన్ని మేళ్ళు కలిగెను.

మనము పూర్వచరిత్రమును స్మరించుకొని మురియరాదు. పరిషత్తిప్పు డేమి చేయుచున్నది? మూఁడుకోట్ల మంది

యాంధ్రమహాజనుల పక్షమున నీసంస్థ చేయుచున్న సేవ యేది? ఇది భాషాభిమానుల యాదరణమున కెంతవఱకు పాత్రముగ నున్నది? అను నంశములను జర్చించుటకు ప్రత్యాంధ్రునకు హక్కు గలదు.

పరిషత్తువారు తొలుత త్రైమాసికముగ ప్రచురించిన ఆంధ్రసాహిత్యపత్రిక కొంతకాలము మాసపత్రికగ మాఱి మఱలనిపుడు ద్వైమాసపత్రికారూపము దాల్చినది. ఇందిపుడు ప్రాచీనగ్రంథ మొకటియుఁ గొలఁది వ్యాసములు మాత్రము ప్రచురింపఁబడుచున్నవి. పత్రికానిర్వహణము తృప్తికరముగా లేదు. ప్రతిపర్యాయము పత్రిక యెంతయో ఆలస్యముగా వచ్చుట తటస్థించుచున్నది. పత్రికలో వ్యాసముల వ్రాయువారే పదిమందియో గలరు. ఎంతకాల మీపత్రికాచక్రము తిరిగినను పదియంకులలోఁ దిరుగవలసినదే. శాసనప్రతిబింబములు పరిశోధకవ్యాసములు పలుచఁబడుచున్నవి. పత్రికారూపమున ఆంధ్రదేశమునకు పరిషత్తు ఒసంగు సందేశ మిటు లున్నది. పత్రిక నింక విపులము చేయుట-ఉపయుక్తములగు వ్యాసములు ప్రచురించుట నకాలములో పత్రిక ప్రచురించుట చందాదారుల సంఖ్య నభివృద్ధిపఱచుట- ప్రాచీనప్రబంధములు పత్రికలోఁ జేర్పక విడిగా ప్రచురించుట లోనగు కట్టుబాటులు జరుగుట చాల యవసరమైనను పరిషత్తు ఇంతవరకందులకుఁ బూనుకొనకపోవుట సంతాపకరము. సామాన్యులగు వారు నిర్వహించు అభినవసరస్వతి, సరస్వతి, గ్రంథాలయ సర్వస్వము. లోనగు పత్రికలవలెనేని పరిషత్పత్రిక ప్రజాకర్షణము నొందకున్నది. ఇందుల కెంతవఱకు పరిషత్తు, బాధ్యత తెలుపుకొన నున్నదో చూడవలసియున్నది.

గ్రంథప్రచురణము గూర్చి యించుక చెప్పవలసియున్నది. పరిషత్తువారు పంద్రెండేండ్ల పయికాలమునుంచి ప్రచురించిన గ్రంథములలో కవిజనాశ్రయము రాయవాచకము జైమినీభారతము శివరాత్రిమహాత్మ్యము చంపూరామాయణము కావ్యాలంకారచూడామణిలోనితుది ఆశ్వాసములు విప్రనారాయణచరిత్రము చంద్రభానుచరిత్రము అనునవి కొంచెము పెద్దపుస్తకములు. ఇవికాక కొలఁదిగా పుస్తకములు కలవు గాని యవి శతకప్రాయములు. జైమినీభారతము కవిజనాశ్రయము ప్రత్యేకించి ముద్రింపఁబడిన గ్రంథములు. మిగిలిన పుస్తకములు పత్రికలోనుండి పునర్ముద్రితములు. అందు జైమినీభారతవచనము దొడ్డప్పనాయకనూరుజమీందారుగారి త్యాగముచే ముద్రితమై

నది. ఇఁక పరిషత్తువారు స్వాంతముగ ప్రచురించిన దొక కవిజనాశ్రయము మాత్రమె! లిఖితగ్రంథసముదాయమునుండి యుద్ధరింపఁగలిగిన గ్రంథము లెన్నియో గలవు. పైగా భారతము ఆదిపర్వమును శుద్ధప్రతిగాఁ బాఠాంతరములతో ముద్రింతు మనిరి. బసవపురాణమును బరిశుద్ధముగా బ్రకటింతు మనిరి. తంజావూరు లైబ్రరీలోని తెలుగుగ్రంథముల పట్టిక వ్రాయించుచున్నా మనిరి. పావులూరి గణితమును బ్రచురింతు మనిరి. ఇన్నియు నడుగు బట్టినవి. నిఘంటువు పిఠాపురము చేరినది. ఇఁక గ్రంథప్రచురణ మోయీవిధము లోనికి వచ్చినది. తాళపత్రగ్రంథముల సంగతిఁ విచారింతము.

దొరతనమువారు ఆర్థికదుస్థితులను జక్కఁబఱచుకొనుటకుఁ బ్రాచీనగ్రంథసంపాదనమును మానివేసి పుణ్యము కట్టుకొనిరి. నిజామురాష్ట్రమున తెలుగునాఁడునందును ద్రవిడదేశములలోని ఆంధ్రుల గృహములందు ఇతరాంధ్రమండలములందును హాతశేషము లగు గ్రంథములు విరివిగా గలవు. పరిషత్తువా పైదారుసంవత్సరములకుఁ బై కాలమునుండి గ్రంథసంపాదనము మానిరి. చెలికాని లచ్చారావుగారు గతించుటచే పరిశోధకమహోమండలినామ రూపములు కోల్పోయినవి. ఇపుడు సారస్వతప్రపంచమునుండి తొలంగిపోవ నున్న గ్రంథముల గతి విచారించుటలోఁ బరిషత్తేమియుఁ బని చేయుట లేదు. కొలఁదికాలములో నా గ్రంథము లంతరించినచో భాషకుఁ గలుగు నరిష్టమునకు మితియే యుండదు. ఈ సంధిసమయమునఁ బరిషత్తు నిద్రావస్థలో నుంట యెంతయో పరితాపకరము. ఇవి యన్నియు నిటు లుండ ఆంధ్రగ్రంథములను విమర్శించుట కీపరిషత్తు ఉపసంఘము నొకదాని నేర్పఱచెను. ఇపుడిన్ని భారముల తొలఁగఁద్రోసికొని పట్టు మని పరిషత్తు పదినెలల కేని పత్రిక ప్రచురింపక యుంటకంటె విచారకర మగు నంశ మింకొకటి లేదు. జీర్ణగ్రంథము లుద్ధరించుట నూతనలిఖితగ్రంథముల నార్జించుట, చెడిపోవుచున్న గ్రంథములకుఁ బ్రత్యంతరములు వ్రాయుట తన ధర్మములను సంగతి పరిషత్తు మఱచిపోయిన దనుటలో నసత్యము లేదు.

పరిషత్తువారు వార్షికోత్సవములకు మాత్రము పరిషత్కన్యను బంపుచున్నారు. ఇదియొక విచిత్రప్రహసనము. ఎవరి పుణ్యముననో ఒకటిరెండు దినములు విందులతో సమావేశము జరుగుచు ఉపన్యాసములతో కార్యక్రమము ముగియుచున్నది. ప్రణాళికలు మాత్రము సాగుచుండును గాని ఆచరణములోనికేవియు రావు. పరిషదాదాయవ్యయప

త్రికలు ప్రజాసమూహమునందు వ్యాప్తి గల ఆంధ్రపత్రికాదులలోఁ బ్రచురితము లగుట లేదు. ఈసంవత్సరపు పరిషత్సమావేశవృత్తాంతము జరిగిన విధము ఇంతవఱకు వార్తాపత్రికలలోఁ బడలేదు. పరిషదార్థికస్థితి తెలుపు ఆయవ్యయపట్టికయే వార్తాపత్రికలలోఁ బ్రచురింపఁబడలేదు. ఏనాఁడో పరిషత్పత్రికలోఁ బడునందురేమో! వ్యాప్తి బొత్తిగా లేని దానియందుఁ బడినను సర్వజనగ్రాహ్యము కాఁజాలదు. ఈబహిరంగసంస్థ యంతఃపురకన్య యగుటయేలనో తెలియకున్నది.

మరల గ్రామ్యభాషను నిలువదీయ ఆంధ్రప్రముఖులు సాగించుచున్నారు. పిట్టపిడుగువలె విద్యాశాఖవారి యాదరణము నొంది ఆంగ్లపాఠశాలలో గ్రామ్యగ్రంథములు నిలువఁ బ్రయత్నములు జరుగుచున్నది. పన్నెండేండ్ల పరిషత్కన్య శుష్కకాయముతో ఎండిపోవుచున్నదేమి! వయసుపొంకము లేదే మని యొక విమర్శకులని యనక ముందె వ్యావహారికభాషను వదలుటచేతనే యని గ్రామ్యవాది యొకరు పలికిరి. గ్రామ్యభాషావ్యాధి సర్వాంగసుందరి యగు నాంధ్రభాషకు అంటురోగమువలె నావరించినది. ఇత్తఱి పరిషత్తు కదలించినను కదల నంతటి మాంద్యస్థితిలో నేల యున్నదో తోఁచకున్నది. ప్రజాదరణమునకు గ్రామ్యము పాత్రమైనచో పరిషత్తునకు నిలువనీడయే యుండదు. ఆంధ్రసారస్వతమునకుఁ గల నిర్దుష్టస్వరూపమె నశించును. ఇట్టియెడ పరిషత్తు తీవ్రముగా నెదుర్కొనకయుండుట మిగులఁ బరితాపహేతువు.

పరిషత్తు ఆర్థికలోపముచేఁ గొట్టుకొనుచున్నటుల వార్తలు వినవచ్చుచున్నవి. చందాదారులను పోషకులను ఉద్ధారకులను యావజ్జీవసభ్యుల నభివృద్ధిపఱచికొన్నచో శాశ్వతముగాఁ జరుగు వీలుగల పరిషత్తు ఆర్థికలోపమున గొట్టుకొనవలసిన యవసర మేమున్నది. పరిషత్తు తన ధర్మము తాను నిర్వహించుచున్న ఆంధ్రదేశము దాని నుపేక్షింపదుగద! ఈసంస్థ స్వతంత్రముగాఁ బ్రచురించిన గ్రంథములా! వ్రేళ్ళతో లెక్కిడఁదగినన్ని లేవు. వాని విలువలు గూడ మితిమించి యున్నవి. నిఘంటునిర్మాణమూ పరిషత్తునుండి తొలంగినది. తాళపత్రగ్రంథసంపాదనమా! యెన్నఁడో మానుకొనిరి. పరిషత్తు పదొనిమిదేండ్లనుండి యేమి చేయుచున్నది? ద్వైమాసపత్రికను ప్రచురించుటయా? ఇదియు నొక త్యాగకార్యమేనా? ఉద్ధారకులు యావజ్జీవసభ్యులొసంగు విరాళములతోఁ జేసిన శాశ్వతకార్య మొకటియేని కలదా యని భవిష్యదాంధ్రలోకము ప్రశ్నించెనేని పరిష

(10) పరిషత్తువలన గడచిన అయిదుసంవత్సరములనుండి కలిగిన యుపయోగము లెవ్వి? పరిషత్తు అయిదుసంవత్సరములును చేసిన సేవ యేది? పరిషత్పత్రిక మిక్కిలి యాలస్యముగా బయలువెడలుటకు రెండు మూఁడు నాలుగు సంచికలొకమాఱు ప్రచురించుటకు కారణ మేమి?

ఈసంశయములు తీర్చినచో పరిషదుద్దేశ్యములు పరిషత్పత్రిక మేస్థితిలో నున్నది తెలుఁగుదేశమునకుఁ దెలియును గావున అటులఁ జేయఁగోరుచున్నారము.

"కాదు కాదు"

(జయంతి గంగన్నగారు)

"సుగుణయుతుఁ డని కాంబోలు మగువ! వాని
మీఁద మది నిల్పి యున్నావు?"

"కాదు కాదు"

"సుందరాకారుఁ డని వాని యందు ప్రేమ
కల్గియున్నావు కాఁబోలు?"

"కాదు కాదు"

"బుద్ధిసంపన్నుఁ డౌటఁ గాఁబోలు వాఁడు
నీదు హృదయము మెప్పించె"

"కాదు కాదు"

"మంచికులమున వాఁడు జన్మించినట్టి
కారణంబున కాఁబోలు"

"కాదు కాదు"

పెద్దగోడ

(సుబ్బారావుగారు)

ప్రాచీననాగరకతకు పేరువడ్డ దేశములలో చీనా దేశ మొకటి ఆ దేశములోనున్న జనసంఖ్య ప్రపంచములో మరియే యితర దేశమునందును గానరాదు. ఈ దేశమున నొక గొప్ప చోద్యమైన గోడ గలదు. ఆ గోడ చీనా కుత్తరభాగమున నున్నది. తూర్పున పిచిలీసముద్రమునుండి పశ్చిమమున తుర్కీస్థానపు ఎడారులలోని కంటా వ్యాపించియున్నది. దుర్గమారణ్యమధ్యనుండి కూడ నిది నిర్మింపబడినది.

షీహ్వాంట్గే యను రాజు దీనిని క్రీస్తుపూర్వము 205 సంవత్సరప్రాంతమున పూర్తిచేయించె నని చెప్పుదురు. షీహ్వాంగ్టే రాజ్యము చేయుచున్న కాలమున తార్తారు లను నొక అనాగరక తెగవారనేకమారులు చీనా నాక్రమించుకొనుటకు దండయాత్రలు చేయసాగిరి. వారి బాధనుండి దేశమును కాపాడుటకు చక్రవర్తి అదివరకు దూరదూరముగా విడిగా నున్న దుర్గముల నన్నిటిని కలిపి ఏకమైన గోడగా నిర్మింపజేసి, దానిని అభివృద్ధి చేసి బలపరిచి అభేద్యమైన దానినిగా జేసెను.

ఈగోడయొక్క పొడవు 1600 మైళ్ళు. ఎత్తు 25 మొదలు 30 అడుగులవరకు గలదు. వెడల్పు (దళసరి) 15 మొదలు 20 అడుగుల వరకు నుండును. గోడంతయు నల్లరాతితో సున్నముతో కట్టబడినది. దానికి పైన చుట్టును రొమ్ము ఎత్తున పిట్టగోడ యొకటి గలదు. ఈగోడ కంకరయిటుకలతో కట్టబడినది. ఈగోడ కట్టిన యిటుకలు సుమారు రిరువది యంగుళముల దళసరి గలవి. గోడంతయు పాకుడు కట్టి యుండును. ఈ చిన్నగోడయందు కొన్ని రంధ్రములు చేయబడినవి. తాము కానరాకుండగనే, ఆరంధ్రములనుండి సైనికులు శత్రువులను కాల్చవచ్చును. పెద్దగోడయొక్క రెండవయంచున మరియొక పిట్టగోడ గలదు. ఇది వెనుకటి యంచున నున్న పిల్లగోడంత ఎత్తు లేదు. దీనియందు రంధ్రములు చేయబడలేదు. కారణము దేశములోనికి కాల్చవలసిన ఆవశ్యకము ఉండదు గనుకనే. పెద్దగోడయొక్క మధ్యభాగ మంతయు రాళ్ళు మన్ను కలసినదిగా నున్నది.

ప్రతి 200 లేక 300 గజములకు 35 లేక 40 అడుగుల యెత్తుగల గోపురముల వంటి బురుజులు గలవు. ఈబురుజులపై నుండి గోడయొక్క రెండువైపుల నున్న ప్రదేశమును స్పష్టముగా చూడవచ్చును

ఒకవారము దినముల క్రిందట నేను మా మేడమీఁదఁ గూర్చుండి యేదియో వ్రాసికొనుచుండఁగాఁ గ్రింద వీధి గుమ్మమువైపునుండి "జయా! విజయీభవ! దిగ్విజయీభవ! బట్టువారము మహాప్రభో! రాజకుమారులము: అన్నవస్త్రములు లేక వచ్చినవారము మహాప్రభో! అర్థివాండ్రము" అని నాల్గుమూడు స్త్రీపురుషకంఠధ్వను లొక్కపెట్టున చెవులు గింగురు మనునట్లు బిగ్గఱగా వినవచ్చినవి. ఆ కేకలు విని నేను తటాలున లేచి మేడ దిగి క్రిందికి వచ్చి చూచితిని. ఒకఁడు—ఇంచుమించుగా—నలువదియేండ్ల నడిమి వయస్సువాఁడు. మఱియొకఁడు పదునాఱేండ్ల పడుచువాఁడు. వారితో దాదాపు అఱువదియేండ్లవయస్సు గల యొక ముసలియామెయు, ముప్పదియేండ్ల ప్రాయము గల యొక ముద్దరాలును గలరు. ముసలియామె చేతిలో మూఁడునాలుగేండ్ల మగపిల్లవాఁడును, పడుచామె యొడిలో పదిపదునొకండు నెలల పసిపాపయు నుండిరి. పురుషు లిరువురకును, నొకచేతఁ దనకంటె బెత్తెడు పొడుగైన కందిపోడల కఱ్ఱయును, రెండవచేత—గంటముతోఁ గలిపి కట్టిన త్రాటియాకుల పుస్తకము నున్నవి. బట్టలు మిక్కిలి మాసియున్నవి కాని—మీసములు మాత్రము మెలిపెట్టఁబడియున్నవి. పొట్టలుబడుగులై యుక్కిలించుకొని యున్నవి కాని—పట్టెవర్థనములు మాత్రము దిట్టముగా నున్నవి. అడుగుకొనుటకు వచ్చినవారేకాని యాకారములు మాత్ర మద్భుతములుగానే యున్నవి. మంచి వయస్సులోనివారు—దీర్ఘకాయులు—దృఢశరీరులు— అన్నియు నున్నవి. పాపము అన్నము లేదు. ఆపురుషు లిద్దరు నన్నదమ్ము లనియు, ముసలియామె తల్లి యనియు, రెండవయామెయు, పిల్లలును పెద్దవాని కుటుంబ మనియు నాకుఁ దోఁచినది. పాపము! వీరు, తూర్పునుండి యన్నము లేక వచ్చినారట. దక్షిణమున మాత్ర మన్న మెక్కడ నేడ్చినది?

తొలుత వారిని జూచిన తోడనే నాకుఁ గొంచెము కోపము వచ్చి "ఏమి! అట్లఱచెదరు? అన్నము లేకపోయిన యెడల నేదియేని కూలిపని చేసికొనరాదా?" అని కసరితిని గాని—తరువాత—నేకారణముననో—జాలి పుట్టి కొంచెము బియ్యము పెట్టి పంపివేసి మరల మేడ యెక్కి వ్రాసికొన మొదలుపెట్టితిని. అంతకు మున్ను వ్రాయుచున్న విషయముపైకి బుద్ధి పోయినది కాదు. బట్టురాజులు పెట్టిపోయిన గట్టికేక—నా చెవులయందు నెట్టుకొని యిట్టె యొక బుద్ధి పుట్టి—అ

ఈబురుజులపైనుంచి గోడలలోనుండి దేశమునైపునకు రాతితో కట్టిన మెట్లుగలవు. నేలకు సమీపముగా గోడలో నున్న యొక ద్వారమునుండి పోయి. మెట్లమీద నుంచి బురుజులపైకి పోవచ్చును.

గోడయొక్క ప్రతిభాగము అన్ని ప్రదేశములయందును బాగుగా బలపరచబడియున్నది. అరక్షితముగా నేభాగమును లేదు. శత్రువు లెంత పరాక్రమవంతు లైనను, భయంకర మైన వా రైనను, దేశస్థులు, బాగుగా కాపాడుకొనగలిగినచో, ఏఆయుధములు లేకపోయినను రాళ్ళతోనే శత్రువులను జయించగలుగుదు రని చూచువారలకు తోచునంతటి కట్టుదిట్టముగా ఆమహాకుడ్యము నిర్మించబడినది. తుపాకులకు, ఫిరంగులకు తుపాకిమందుకు భేద్యము కావచ్చును గాని ఇతరమార్గములచే భేదించుట కేరికిని సాధ్యపడదు. ఇంతటి గోడ ప్రపంచములో మరి యెక్కడను లేదు; కావుననే దానిని, ప్రపంచములోని గొప్ప చోద్యము లేడింటను ఒకదానినిగా పాశ్చాత్యులు పరిగణించుచున్నారు.

విరహఖిన్నుని చలిబాధ

ఉ. నిద్దుర లేక కాల్వదరి నేరెడువృక్షముక్రింద నెట్టిటో
ప్రొద్దును బుచ్చుచుంట మొగమోడక చిందులు త్రొక్కెదోర నా
ముద్దులలక్ష్మి కుందనపుబొమ్మ కవుంగిట గ్రుచ్చి నెయ్యపున్
సుద్దులు పల్కెనన్న దెట స్రుక్కితి వో చలిగా! దురాత్మకా!

(ఒక కవికుమారుడు)